


# కిటుకులు

## ముళ్ళపూడి వెంకటరమణ

పోబోతున్న సుబ్బరాజుని కేకేశాడు రెడ్డిగారు. చూడు రాజూ! చెప్పింది చిన్నకథ అయినందువల్ల పొద్దుండిపోయింది — ఇంకోటి మనసు కొచ్చిందింతలో. ఇదీ ఆలకించి పో. ఓ రోజు నడకతగ్గినా తగ్గినట్టే అన్నారు. ఇది ఎక్కడో విన్న బాపతు — ఎవరో చదవగాననుకుంటా. నువ్వు వినుంటే తూ నా బొడ్డనుకుందారి అని కథ ఆరభించారు రెడ్డిగారు.

కొండపాడనే కుగ్రామంలో అచ్చిరెడ్డని ఓ మోతుబరి. రావలక్ష్మణుల్లాటి బిడ్డలిద్దరు. అందులోనే పేచీ వొచ్చింది. తలిదండ్రాదులైతేనేవి, ఊళ్ళో పెద్దా చిన్నా అయితేనేవి రావలక్ష్మణులు రావలక్ష్మణు లంటూ ఇద్దరిలో పెద్దోణ్ణి రాముడిలాగే చూసుకునేవారు. చీటికీ మాటికీ చిన్నోణ్ణి, చిన్న చూపే జూసేవారు. 'పెద్దోడి చురుకుదనవూ, ఆతేజవూ ఈడి కేది' అనేవారు దానా దీనా లక్ష్మణరెడ్డికి జంకేర్పడింది. చదువంటలేదు. బళ్ళో కెత్తే పెద్దాణ్ణి మెచ్చుకుని తన్ని దిట్టడవేగా అని దోచి, పొలాన గూచుని గొడ్డు దోలుకునేవాడు.

చివరి కిలా మేదకుడని పేరు స్థిరపడి పోయింది.

కాని వాడు మేదకుడుగాడు మరి. చూస్చూశోనాడు ఊరొది ల్లేచ్చక్కా బోయాడు. పట్నం వెళ్ళి సత్రాలెంటా మటాలెంటా తిరిగి అలాగేగాలికి పెరిగి పెద్దోడయ్యాడు. చివరికి చిన్న కంపెనీలో నౌకరు పనయింది. నాలుగైదేళ్ళయ్యే నరికి అడికి ఎటండరు అనే పనిచ్చారు. గుమాస్తా కన్నా రెండాకుల్దక్కువనుకో. రెడ్డికి అక్షరమ్ముక్క పోలిక దెలీపోయినా పద్దు ముక్కలు పైళ్ళు అయ్యేన్నీ గుర్తు తెలిశాయి. అంత చురుకైన బుర్ర మరి. అయినా సదువు సంజె లేనోడికి నా కెందుకీ పెద్ద నౌకరీ అన్నా కంపెనీ పెద్ద సెట్టిగారు ఒప్పుకోలేదు. రెండేళ్ళకి అయన పోడంతో ఈడి కష్టాలారంబ వయినాయి. కుర్రాయన యజమాన య్యాడు. వ్యాపారం పెరిగింది. కంపెనీ పెద్దదయింది. ఆనకోనాడు, ఛస్ చదువు రానోడు 'ఎ టెం డ రేట' ని ఎవరో చెప్పారు. సరే మరికథ యిట్టాగుండాది గాబట్టి నువ్వే మళ్ళీ నౌకరు పనికన్నా దిగిరాలేకపోతే ఇంకోదగ్గిర నౌకరీ జూసుకో అన్చెప్పించారు మేనేజరుచేత. రెడ్డికి మల్లా ఆ కంపెనీలోనే జవానుపని చెయడానికి మనసొప్పలే. ముందరే నేనొద్దంటే పెద్దాయన వొల్లగాదని ఈ పని జేశాడు ఇప్పుడు మీరిట్టాజేశారు. ఇంత వొయిసొచ్చింది. ఇప్పుడేం జెయ్యనెలా బతకను అని ఏడిచాడు దీనంగా.

కొత్తనీరొచ్చి పాత నీర్ని గొట్టేసినట్టయిం దాడి పని. చివరికి జీతం డబ్బులు చేతబెట్టి పొమ్మన్నారు. ఇంటి కెళ్దావంటే మన సొప్పలేదు. అసలే లోకువ. పైగా జవాను పని చేసొచ్చానంటే వొంశానికే అవమానమయిందని పొమ్మంటారు...

రెడ్డి ఆ వీధినపడి కొంపకి బయలు దేరాడు. ఏం జేదారా అని ఆలోచిస్తూ. ఆ రోడ్డు శానా పెద్దది: శానా కంపెనీలూ, దుకాణాలూ, ఇళ్ళూ వున్నాయి. అట్టా అయ్యీ యియ్యీ జూస్తూ రాగా రాగా రెడ్డికి సిగరెట్టు కాల్చ బుద్దేసింది. జేబులోలేవు. కొందామని జూశాడు. కొట్టెక్కడా లేదు. అలా వెతుకుతూ వెతుకుతూ అరమైలు దూరం నడిచాడు. ఎక్కడా కిళ్ళీకొట్టు కనబళ్ళే.

అమాంతంగా రెడ్డికో ఉపాయం దోచింది. నాలాగా ఈ రోడ్డు నొచ్చే వాళ్ళెంతమందికి సిగరెట్టుకావలిసుంటది. ఆళ్ళంతా ఏటి జేస్తన్నారూ. అలాటాళ్ళకిక్కడ దుకాణం వెడితే బాగుండదా అని తోచింది. అంతే ఆ జీతం డబ్బుల్తో సిగరెట్లు చుట్టలు బీడీలు కిళ్ళీలు గట్రా కనిని కనిని గొని ఓ జంగిడికెత్తి రెండు రవుండ్లు గొట్టాడు ఆ వీధిలో. మద్దినాళకే అమ్ముడయ్యాయి. వెంటనే మళ్ళీ జంగిడికి సరుకెత్తి మళ్ళీ దిరిగాడు. సాయంత్రానికే సరు కయిపోయింది.

నాలుగు రూపాయలు లాభం మిగిలింది. మర్నాడూ అలాగే జేశాడు. తరవాత ఓ పెద్దకంపెని అయన్ని బతిమాలి పీదరుగుమీద చోటు సంపాయించి దుకాణం బెట్టాడు. తనక్కడ కూర్చుని, మళ్ళీ జంగిడికి సరుకెత్తి ఓ కుర్రాడిచేత అమ్మించాడు. నాలుగురోజుల్లో ఆ వీధిని రెండోచివర కూడా చిన్న దుకాణం బెట్టాడు.

సుబ్బరాజూ, చెబితే చాలా వుంది గాని అవుసరంలేదు. ఇలా మెల్లిగా కాల్నిలదొక్కుకుని వ్యాపారం బాగు చేసుకున్నాడు. చురుకైన బుద్ధేమో పదిరకాల వ్యాపారాల్లో దిగి పదిండాల డబ్బు గడించాడు. పొగాకులో బాగా గడించాడనుకో. చెప్పొచ్చింది—పదేళ్ళ యేసరికి లక్షాధికారయ్యారుకున్నాడు. యాపారం వృద్ధికి రావడానికి దాన ధర్మాలు ఎంత ముఖ్యమో దెలిసినవాడు గాబట్టి అయి ఓ రకం పన్నులే అన్నట్టుగా డబ్బు వెదజల్లాడు. క్రమంగా పేరు పలుకుబడి వచ్చాయి. రాజకీయాల్లోకి దిగాడు. అకాణ్నించి సిరితోబాటు దశా అందుకుంది, ఎమ్మెల్యే అయ్యాడు, ఊరూరా పేరు మ్రోగింది. పేరుమోగిన చోటల్లా యాపారం ఊడలు దింపింది. రాజకీయ వ్యాపారంలో కూడా డబ్బు తిప్పాడు. రెండూ చెట్టా పట్టాలేసుకు పెరిగాయి. అంతటిగట్టి వాడతనే అనిపించుకున్నాడు రెండిటా.

ఒకనాడు ఒహ పెద్ద సవస్థకి రెడ్డిగారు పెద్దచందా — కాదు విరాళం అనాల్లే-విరాళం ఇచ్చాడు. లక్షరూపాయలు. సరిగ్గా అనాటికే ఆయనని కొత్తమంత్రి వర్గంలో మనిష్టరుగా తీసుకున్నట్లు పత్రికలో వార్త వచ్చింది. ఇహ చూసుకో...ఆనాటిసభ అనుకున్న దాని కన్నా మరింత జోరుగా జరిగింది. ప్రజ విరగబడి వచ్చింది.

దానం పుచ్చుకుంటున్న సవస్థ అధ్యక్షుడు (ఎవరను కున్నానరే) రెడ్డిగారిని అకాశాని కెత్తేశాడు. ఆగర్భ శ్రీమంతుడన్నాడు. అందాల రాజన్నాడు. బృహస్పతో ఆడెవడో అన్నాడు చాణుక్యుడన్నాడు. చంద్రగుప్తు డన్నాడు.తిమ్మరుశవుతాడన్నాడు ...పది కంపెనీలు పెట్టి పది మందికీ వుపాధి చూపి అన్నం బెట్టాడన్నాడు. అదేగాక ఇలా బీదా బిక్కికీ సవస్థలకీ చేతికెమికలేకుండా దానాలిస్తన్నాడన్నాడు. ఇహ పొగ శ్శేక ఆయాన మెచ్చి ఆపేసి నమస్కారంబెట్టాడు. చెక్కు అందుకున్నాక ఆసవస్థ తాలూకు పుస్తకందెచ్చి - అందులో గొప్పవాళ్ళ చేత మంచిమార్కులు రాయించి చేవాళ్ళు బెట్టిస్తారులే—అద్దెచ్చి అందులో తమరి ఆశీర్వచనం రాసి చేవ్రాలు పెట్టవలసిందని ఎదరబెట్టాడు.

రెడ్డిగారు మాటాళ్ళేదు. పుస్తకం

వంక పరీక్షగా జూశాడు. తలొంచుకు న్నాడు, కళ్ళు చెమ్మగిల్లాయి. చివరికి ధైర్యం తెచ్చుకుని లేచినిలబడి సభా వందనంచేసి "అయ్యా మీకు తెలుసో తెలీదోగాని మీ వూళ్ళో శానా మందెరు గుదురు—నాకు చదువురాదు. బొత్తిగా రాదు'' అనేసి కూర్చున్నాడు.

అధ్యక్షుడు నిర్ఘాంతపోయాడు. సరసమే మోనని నవ్వి జూచాడు. కాని తేలిపోయింది. అంతలో అనుమానమొచ్చి అ చెక్కు తీసి చూసి "మరి ఇదో? ఇందుమీద సంతకమెలా బెట్టారు?" అన్నాడు!

"సంతకానికా్కవలసిన పాటి అక్షర ముక్కలు నేర్చుకున్నాను—చెక్కుల కోసమని. తప్పదుగదా'' అన్నాడు రెడ్డిగారు.

సభ నిశ్శబ్దమయిపోయింది. అంతా చిన్నబుచ్చుకున్నారు. అధ్యక్షుడు కేమీ పాలుపోలే. మొహం చెల్లదనుకున్నారు. అంతలో అతనికి ఉపాయం దోచింది—ఈ అవమానకర స్థితినుంచి బయట పడ్డానికి.

"ఆహా, సభాసదులారా! ఇది మన శ్రీరెడ్డిగారి మేధస్సుకు మరొక గొప్ప జోహారు. బొత్తిగా ఏమీ చదువుకో కుండానే వారు ఇంతవారై ఇన్ని లక్షలు ఆర్జించి ఇంతదానమిచ్చి మనకి పరిపాల కుడయ్యాడు గదా! ఆహా శ్రీవారే గనక చిన్నతనంలో ఆయొక్క చదువుకూడా చదువుకుని ఉంటే ఇంకెంత వారయ్యే వారో గదా!'' అన్నాడు. అదలాగుంచు.

సభలో అందరూ తేరుకొని, చప్పట్లు కొట్టారు జైజైలతో ఓహోలతో సభ మారుమోగిపోయింది. రెడ్డిగారు చిరు నవ్వునవ్వి మరలా సభావందనం జేశారు చేసి చిన్నముక్కోటన్నారు.

"నువ్వు జెప్పు సుబ్బరాజూ, ఆయనే గనక చిన్ననాడు చదువుకునుంటే ఎంత వాడై ఉండేవాడు? అఖిల భారతనాయ కుడా? ఐక్యరాజ్య సమితిలో అధ్యక్షుడా? ఇండియా ఆర్థికమంత్రా? ప్రెసిడెంటా? ఏమయ్యేవాడు?'' అన్నారు రామిరెడ్డి గారు కథ ఆపి.

సుబ్బరాజు నవ్వాడు.

"ఏవీ అయేవాడు గాదు. చదువుకొ నుంటే అల్లా ఉజ్జోగం దీసేసిన సెట్టి కంపెనీలో ఉద్యోగం ఉండేదేగాదు. అప్పట్నుంచీ అటెండరుగా ఉండేవాడు. మహాయితే గుమస్తా అయ్యేవాడు'' అన్నాడు.

రామిరెడ్డి మందహాసంచేసి 'సరే నువెళ్ళిరా' అన్నారు.

(ఇదేదో ఇంగిలీషు కథకి కార్బన్‌కాపీ అంటే మీమాటే రైటు సోమర్సెట్ మాఘం కథకి!)

---